సాక్షి సంగారెడ్డి
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



మొక్కజొన్నకే మొగ్గు
జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో మొక్కజొన్న సాగు పెరిగింది. దాదాపు 25 వేల ఎకరాల్లో పంట సాగైనట్టు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. 8లో



హైవేపై వరుస ప్రమాదాలు
మెదక్ – హైదరాబాద్ హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు నెలల కాలంలో ఈ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు. 9లో



అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం
అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నట్లు తెలిపారు. 9లో

న్యూస్‌రీల్

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఇల్లులేని పేదలు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు. ఆదర్శ విద్యాలయం రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ శివాలయం, భవానీ మందిరం రోడ్డు గుండా తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలో సొంత ఇళ్లు లేని పేదలు ఎంతో మంది ఉన్నారని, చాలీచాలని సౌకర్యాలు ఉన్న అద్దె ఇళ్లలో ఉంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాపాలవుతున్నా పట్టించుకోవడం లేదని, ఇళ్లులేని వారికి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, అశ్వాక్, అజారొద్దీన్, మొగులయ్య, సుశీలమ్మ, అమృతమ్మ, శాంతమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

'దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు తరలిరావాలి'

నర్సాపూర్ రూరల్: దొడ్డి కొమురయ్య విగ్రహ ఆవిష్కరణకు కురుమలు పెద్ద ఎత్తున తరలిరావాలని కురుమ సంఘం సంగారెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షులు పుష్ప నగేశ్, సార మల్లేశ్ పిలుపునిచ్చారు. బుధవారం నర్సాపూర్ ఆనంద్ గార్డెన్‌లో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 26న సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలో దొడ్డి కొమరయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావుతో పాటు ఆయా పార్టీల నాయకులు హాజరవుతారని తెలిపారు.

భ్రమరాంబ మల్లికార్జున ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న అర్చకులు, సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. దేవాలయ ఈఓ శశిధర్, దేవాదాయ శాఖ సీఎఫ్ఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్, ఆలయ చైర్మన్ ఏనుగు తులసి రెడ్డి, అర్చకులు, భక్తుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ.37,77,320 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న ఎడ్లబండ్ల ఊరేగింపు



ఎడ్లబండ్ల ఊరేగింపులో గ్రామస్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మహాశివరాత్రిని పురస్కరించుకొని గురుపాదగుట్ట శివాలయంలో బుధవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణ చుట్టూ భక్తులు ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. యువకుల నృత్యాలు, కేరింతల మధ్య నిర్వహించిన ఎడ్లబండ్ల ఊరేగింపు ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచ్ సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు బలరాం సంగమేశ్వర్, పూజారి దత్తు, తదితరులు పాల్గొన్నారు.

షేడ్ నెట్‌తో మొక్కకు రక్ష

- వేసవి దృష్ట్యా నర్సరీలపై ఏర్పాటు
- పంచాయతీ గ్రీన్ ఫండ్ నుంచి ఖర్చు



బుదేర నర్సరీలో మొక్కలపై షేడ్ నెట్ ఏర్పాటు చేసిన దృశ్యం

రాయికోడ్(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం నర్సరీల్లో మొక్కలు ఎండకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోని నర్సరీల్లో మొక్కలు నడటం పూర్తయింది. అయితే మొక్కలు ఆరోగ్యంగా సకాలంలో ఎదగాలంటే నీరు, నీడ, పర్యవేక్షణ తప్పనిసరి. ఏమాత్రం అలసత్వం చేసినా వేసవి దృష్ట్యా ఎండ తీవ్రతకు మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు నర్సరీల్లో మొక్కలపై నెట్‌లను ఏర్పాటు చేయడం, నీటి తడులను అందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

- గతంలో నెట్‌ల ఏర్పాటుకు నిధులను జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద అందించేవారు. ఇప్పుడు గ్రామ పంచాయతీ గ్రీన్ ఫండ్ నిధులను వినియోగించి షేడ్ నెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పలు మండలాల్లోని నర్సరీల్లో నెట్‌ల ఏర్పాటు ప్రారంభమైంది. ఒక్కో నర్సరీకి నెట్ ఏర్పాటు కోసం రూ.2,500 వెచ్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో 647 నర్సరీలు

జిల్లాలో మొత్తం 647 నర్సరీలు ఉన్నాయి. ఆయా నర్సరీల్లో మొక్కలు ఎదుగే దశలో ఉన్నాయి. ఈ ఏడాది ఒక్కో నర్సరీలో ఏడు వేల మొక్కలను పెంతున్నారు. గతంలో నర్సరీల్లో మిగిలిన మొక్కల్లోంచి మరో మూడు వేలను సమకూర్చి ఒక్కో గ్రామ పంచాయతీలో తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా పది వేల మొక్కలను నాటాలని లక్ష్యం నిర్దేశించారు. ఒక్కో నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకం కోసం రూ.1.68 లక్షలు వెచ్చిస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఈ క్రమంలో మొక్కలు ఎండిపోకుండా వచ్చే మూడు నెలలు పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు.

- ఎండల తీవ్రత ఎక్కువవుతున్న క్రమంలో నీటి తడులు ఇష్టానుసారంగా అందిస్తే మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉంటుంది. మొక్కలకు విధిగా రోజూ ఉదయం 8గంటల లోపు, తిరిగి సాయంత్రం 6 గంటల తర్వాత రెండు సార్లు నీటి తడులను అందించాలి. అదేవిధంగా షేడ్‌నెట్‌లు మొక్కలపై ఉండేలా చూసుకోవాలి. మధ్యాహ్నం ఎట్టిపరిస్తుతుల్లో మొక్కలపై తీవ్రమైన ఎండ పడకుండా చూసుకోవాలి. సింతటిక్ ట్యాంకుల్లో నిల్వ ఉండి వేడిగా అయిన నీటిని మొక్కలకు అందించరాదు. చల్లటి నీటినే మొక్కలకు అందించాలి. తగిన జాగ్రత్తలు పాటిస్తే వచ్చే హరితహారంలో లక్ష్యం మేర మొక్కలను నాటే అవకాశం ఉంటుందని నిర్వాహకులకు అధికారులు సూచిస్తున్నారు.

పనులు కొనసాగుతున్నాయి



నర్సరీల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కల పెంపకం కొనసాగుతోంది. వేసవిలో మొక్కల సంరక్షణపై ఈజీఎస్ సిబ్బందికి, నర్సరీల నిర్వాహకులకు సూచనలు చేశాం. నర్సరీల్లో నెట్‌ల ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయి. నర్సరీల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులుకు వివరించాం. ఎప్పటికప్పుడు నర్సరీలను పర్యవేక్షిస్తున్నాం. లక్ష్యం మేర మొక్కలు చేతికందేలా చర్యలు చేపడుతున్నాం.

– మణికుమార్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఆయా శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పదో తరగతి విద్యా బోధన, ప్రత్యేక తరగతుల నిర్వహణ, విద్యార్థులకు స్నాక్స్ అందించడం, క్యాటరింగ్, నాణ్యత గల ఆహారం అందించడం, పర్యవేక్షణ, తదితర అంశాలపై ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహాల సంక్షేమ అధికారులు, సరుకుల రవాణా కాంట్రాక్టర్లు, తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. విద్యార్థి భవిష్యత్‌కు పదో తరగతి పునాదిలాంటిదన్నారు. ప్రస్తుత సంవత్సరం ఆరు పేపర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నందున, దానికి తగ్గట్టు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం తమ తమ నిర్దేశిత సమయాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. స్నాక్స్ కోసం ప్రతి విద్యార్థికి ప్రభుత్వం రూ.15 ఇస్తోందని, మంచి స్నాక్స్ ఇవ్వాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వసతి గృహాల్లో నూటికి నూరు శాతం ఫలితాలు రావాలని, లేనట్లయితే ఆయా సబ్జెక్టు టీచర్, వసతి గృహ సంక్షేమ అధికారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించడానికి సమష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్ పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామాల నిర్మాణమే లక్ష్యం

టీబీ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ రాజేశ్వరీ



మాట్లాడుతున్న రాజేశ్వరీ

పటాన్‌చెరు టౌన్: టీబీ రహిత గ్రామాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు టీబీ నియంత్రణ జిల్లా అధికారి డాక్టర్ రాజేశ్వరి అన్నారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ క్షయ నివారణ సంస్థ, టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో బ్రేక్ ఇన్ ది బారియర్స్ ప్రాజెక్ట్ పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల పంచాయతీ కార్యదర్శులకు టీబీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజేశ్వరి మాట్లాడుతూ.. టీబీ పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. అనంతరం బ్రేక్ ఇన్ ది బారియర్స్ ప్రాజెక్టు ప్రోగ్రాం మేనేజర్ పరస పురుషోత్తం మాట్లాడుతూ.. టీబీని నిర్మూలించడానికి గ్రామాల్లో వివరాలు సేకరించినట్లు తెలిపారు. పటాన్‌చెరు ఎంపీడీఓ బన్సీలాల్ మాట్లాడుతూ.. టీబీ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అమీన్‌పూర్ ఎంపీడీఓ మల్లేశ్వర్ మాట్లాడుతూ టీబీ నియంత్రణలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ దేవేందర్ రాజ్, టీబీ నియంత్రణ కోఆర్డినేటర్లు కృష్ణ, అరుణ, నర్సింలు, చంద్రకళ, అనిల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మార్చి 1న ప్రభుత్వ భూముల వేలం



వేలంపాటపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎండీఏ అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లా హెచ్ఎండీఏ పరిధిలోని మూడు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను వేలం వేస్తున్నట్లు హెచ్ఎండీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగాధర్ తెలిపారు. బుధవారం రామచంద్రాపురం పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో ముందస్తుగా బిడ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల, అమీన్‌పూర్, జిన్నారం మండల పరిధిలోని 23 ప్లాట్లకు మార్చి 1న ఆన్‌లైన్ పద్ధతిలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంలో ప్లాట్లు దక్కించుకున్న వారికి పరిశ్రమలకు తప్ప ఎలాంటి నిర్మాణాలకైనా అనుమతులు ఇస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు రూ.1,180 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రభుత్వం తెలిపిన విధంగా బిడ్ నగదును చెల్లించాలన్నారు. బిడ్ నగదు చెల్లించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. వేలంలో ప్లాటు రానివారికి చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇస్తామన్నారు. ప్లాటు పొందిన వారు సకాలంలో నగదు చెల్లించకపోతే బిడ్ నగదు తిరిగి చెల్లింపు ఉండదని స్పష్టం చేశారు. ఈ వేలంపాటలో ఒకరి నుంచి ఐదుగురు సభ్యులు గల గ్రూపు పాల్గొనవచ్చని తెలిపారు. వేలంలో ప్లాట్ పొందినవారు వారంలో ప్లాట్ ధరలో 25 శాతం, మిగిలిన మొత్తాన్ని 90 రోజుల్లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. 25 శాతం నగదు చెల్లించిన తర్వాత రుణాల కోసం బ్యాంకుకు వెళ్లేవారికి ఎన్ఓసీ ఇస్తామన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో 121 గజాల నుంచి 3,630 గజాల స్థలాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అమీన్‌పూర్ మండల పరిధిలో 16, రామచంద్రాపురం మండల పరిధిలో 6, జిన్నారం మండలంలో ఒక ప్లాటుకు వేలం వేస్తామని తెలిపారు. ఎటువంటి చిక్కుల్లేని భూములనే వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ చీఫ్ ప్లానింగ్ అధికారి గంగాధర్, రామచంద్రాపురం తహసీల్దార్ జయరాం, డీఏఓ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను పకడ్బందీగా నిర్వహించండి

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగును నిర్లక్ష్యం చేయకుండా పకడ్బందీగా నిర్వహించాలని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. వచ్చినవారికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అవసరమైన వారికి అద్దాలు, శస్త్రచికిత్స నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయికోటి సుప్రజా భాస్కర్, ఎంపీపీ స్వప్న రవి, వైద్యాధికారులు షాలిని, కృతిక, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం

ఆరుబయటే విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు రాలేదని బుధవారం బడికి తాళం వేసి నిరసన తెలిపాడు. దీంతో చేసేది లేక విద్యార్థులు ఆరుబయట కూర్చోవాల్సి వచ్చింది. నిర్మాణ పనులు చేపట్టి ఏడాది గడిచిందని, ఇప్పటివరకు చేపట్టిన పనులకు రూ.10 లక్షలు రావాల్సి ఉందని తెలిపాడు. విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని హెచ్ఎం, ఉపాధ్యాయులు సంబంధిత కాంట్రాక్టర్‌కు నచ్చజెప్పడంతో తాళం తీశాడు. రెండుగంటల పాటు విద్యార్థులు ఆరుబయటే కూర్చున్నారు.



ఆరుబయట కూర్చున్న విద్యార్థులు

జాతరకు వేళాయె

- రేపటి నుంచి బడంపేట రాచన్న స్వామి ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ నిర్వాహకులు



చెన్న వీరయ్య స్వామి తపస్సు చేసిన గుహ





బడంపేట రాచన్న స్వామి ఆలయం, (ఇన్‌సెట్‌లో) భద్రకాళీ సమేత శ్రీరాచన్నస్వామి

కోహీర్(జహీరాబాద్): అడవి స్థానువుల్లో, ఎత్తైన గుట్టలు, చెట్లు, చెరువుల మధ్య ప్రశాంతమైన వాతావరణంలో వెలిసిన భద్రకాళి సమేత శ్రీ రాచన్న స్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ జాతర ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కోహీర్‌కు ఎనిమిది కిలో మీటర్ల దూరంలో వెలిసిన బడంపేట రాచన్న స్వామి పుణ్యక్షేత్రం ఎందరో ఋషులు, తపస్సు చేసిన అతి పురాతనమైన దివ్యక్షేత్రము. ఇక్కడి అమృత గుండంలో స్నానమాచరించి అగ్నిప్రవేశం చేసి స్వామివారిని దర్శించుకుంటే శివైఖ్యము చెందుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

- ఆలయంలోకి ప్రవేశించగానే భక్తులకు మండపంలో నందీశ్వరుడు స్వాగతం పలుకుతాడు. స్వామివారికి ఒకవైపు విఘ్నేశ్వరుడు మరో వైపు ఉమమహేశ్వరులు దర్శనమిస్తున్నారు. పక్కనే గుట్టపైన శ్రీభమరాంబ మల్లికార్జునస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.
- స్థల పురాణాన్ని బట్టి చూస్తే సుమారు ఏడు వందల ఏళ్ల క్రితం భక్తుడు శ్రీ చెన్నవీరయ్య స్వామి స్వామివారిని ప్రతిష్ఠించి నిరంతరం సేవించి తరించారు. గోర తపస్సు చేసి శివైఖ్యం పొందినట్లు చెబుతారు. శ్రీచెన్నవీరయ్యస్వామి తపస్సు చేసిన గుహ స్వామివారి ఆలయానికి అరకిలోమీటర్ దూరంలో అడవిలో అయ్యగవి పేరిట దర్శనమిస్తోంది. జాతర ఉత్సవాల ప్రారంభం అనంతరం మొదటి పూజలు చెన్న వీరయ్య స్వామికి నిర్వహించడం విశేషం.

కార్యక్రమాల వివరాలు

- శ్రీరాచన్నస్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. 24న శుక్రవారం శివయోగి శివాచార్య మహాస్వామి తంగేడపల్లి వారిచే ధ్వజారోహణం, శిఖర పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి 10 గంటలకు హరికథ, బుర్రకథ చెప్పిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భజనలు చేస్తారు. రాత్రి 11 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, ఊరేగింపు, అగ్నిదహన కార్యక్రమం ఉంటుంది.
- 25న శనివారం తెల్లవారుజామున స్వామివారి పల్లకీసేవ కార్యక్రమం, అగ్నిప్రవేశం నిర్వహిస్తారు. తర్వాత స్వామి వారి సర్వదర్శనం ఉంటుంది. స్వామివారిని దర్శించుకోవడానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. 26 తేదీ ఆదివారం మధ్యాహ్నం శ్రీ భద్రకాళి సమేత శ్రీ రాచన్న స్వామి కల్యాణోత్సవం, సాయంత్రం 7.30 గంటలకు స్వామి వారి రథోత్సవ కార్యక్రమం ఆలయ మాడవీధుల్లో ఘనంగా నిర్వహిస్తారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



మూడు రోజులపాటు నిర్వహించే రాచన్నస్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వైద్య, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నాం. దాతలు చిలకపల్లి కృష్ణమూర్తి, కొలాస్ పరివారం వారి సహకారంతో భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నాం. ఉత్సవాలను విజయవంతం చేయడానికి అధికారులు, భక్తులు సహకరించాలి.

– శివరుద్రప్ప, ఆలయ కార్యనిర్వాహణాధికారి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కొడిపల్లి(నర్సాపూర్): గ్రామాలతో పాటు అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాయిలాపూర్‌లో రూ. 20 లక్షలతో నిర్మించ తలపెట్టిన పంచాయతీ భవనానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం సీసీ రోడ్ల శంకుస్థాపనతో పాటు ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గ్రామాలు, తండాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో అర్హులందరికీ పింఛన్లు అందుతాయన్నారు. అనంతరం సునీతారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజల అభివృద్ధికి పాటుపడుతున్నాడని కొనియాడారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుర్మ శేఖులు, ఎంపీపీ రాజునాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాగ్సాన్‌పల్లి సర్పంచ్ ఎల్లం ఉన్నారు.



పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సునీతారెడ్డి

క్లుప్తంగా

నేటి నుంచి సిటీ పోలీసుయాక్ట్ అమలులో

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ ఎస్.శ్వేత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే మార్చి 3వ తేదీ వరకు ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. వీటి నిర్వహణకు ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. డీజే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయన్నారు. బంద్‌ల పేరిట బలవంతంగా సంస్థలు, కార్యాలయాలు మూసివేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళ అదృశ్యం


బాలమణి (ఫైల్)

నర్సాపూర్: నర్సాపూర్ బస్టాండ్‌లో మహిళ అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌కు చెందిన బోరంచ బాలమణి ఈ నెల 15వ తేదీన నర్సాపూర్‌లో బస్టాండ్‌లో కనిపించకుండా పోయింది. ఈ ఘటనపై ఆమె కుటుంబసభ్యులు 21వ తేదీన ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, బాలమణి ఆచూకీ తెలిస్తే.. 94906 17054 నంబరుకు కాల్ చేయాలని ఎస్‌ఐ శివకుమార్ చెప్పారు.

రెండోరోజూ ఏసీబీ సోదాలు

కౌడిపల్లి(నర్సాపూర్): తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మంగళవారం ధరణి ఆపరేటర్ వేణురెడ్డి, మధ్యవర్తి రాజును ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్న విషయం తెలిసిందే. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు వెంకటరాజాగౌడ్, రమేష్‌తోపాటు సిబ్బంది సాయంత్రం వరకు సోదాలు నిర్వహించారు. లంచం తీసుకున్న ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరిచామన్నారు.

యువకుడిపై అత్యాచారం కేసు

మద్దూరు(హుస్నాబాద్): ఓ యువతిని నాలుగేళ్లుగా ప్రేమించానన్నాడు...శారీరకంగా లోబర్చుకున్నాడు. తీరా పెళ్లి చేసుకోమని అడిగేసరికి ఆ యువకుడు నిరాకరించాడు. దీంతో దూళ్మిట్ట మండల పరిధిలోని కూటిగల్‌కు చెందిన జోగిని వంశీపై అత్యాచారం కేసు నమోదు చేసినట్టు సీఐ సత్యనారాయణ బుధవారం తెలిపారు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేశామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ నారాయణ ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సిద్దిపేటరూరల్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందారు. రూరల్ ఎస్‌ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సల్మాన్(28) ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం సిద్దిపేట పట్టణానికి వలసవచ్చాడు. పట్టణంలో సింగోజు శ్రీనివాస్ వద్ద వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. పనిలో భాగంగా బుధవారం చిన్నగుండవెల్లి పాఠశాలలో మన ఊరు–మనబడిలో భాగంగా భోజనశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే పైపులు అమర్చుతున్నారు. నిర్మాణ గదిపై విద్యుత్ తీగ ఉంది. పైపు విద్యుత్ తీగకు తగిలింది. దీంతో సల్మాన్ ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన తోటి పనివారు వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. సింగోజు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు ఆటంకం కలిగించాడని..

బెజ్జంకి(సిద్దిపేట): కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి నెలరోజుల జైలు శిక్ష విధించారు. వివరాల్లోకి వెళితే.. ఎల్లంపల్లికు చెందిన సంగెం రూపేష్ 2019లో బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ సుధాకర్ విధులకు ఆటంకం కలిగించాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. బుధవారం కేసు విచారణకు రాగా హుస్నాబాద్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కృష్ణతేజ్ రూపేష్‌కు నెలరోజుల జైలు శిక్ష, రూ.7,500 జరిమానా విధించినట్టు పోలీసులు తెలిపారు.

మరో ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- నిర్మాణానికి రూ. 25 కోట్లు మంజూరు
- నేడు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణ, సమీప గ్రామాల ప్రజలకు నాణ్యమైన, తాజా కూరగాయలు, మాంసం, పండ్లు, పూలు అందించే లక్ష్యంతో మరో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మించనున్నారు. 2020లో సీఎం కేసీఆర్ సిద్దిపేటకు వచ్చినప్పుడు మంత్రి హరీశ్‌రావు మరో ఇంట్రిగ్రేటెడ్ మార్కెట్ కావాలంటూ ప్రతిపాదనలు అందజేశారు. మంత్రి చొరవతో దీని నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు అయ్యాయి. రెండో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అందరికీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో జెడ్పీ కార్యాలయ (బ్లాక్ ఆఫీస్)ఆవరణలో స్థలం గుర్తించారు. సిద్దిపేట బంజారాహిల్స్ గా పేరొందిన హౌసింగ్ బోర్డ్, మైత్రివనంతో పాటు ఆదర్శ్ నగర్, టిలికం నగర్, టీచర్స్ కాలనీ సమీప ప్రాంతాల్లో ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఇక్కడే మార్కెట్ నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు గురువారం శంకుస్థాపన చేయనున్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా...

వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లా కేంద్రాల్లో సిద్దిపేట ముందువరుసలో ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాల కల్పనపై కూడా మంత్రి దృష్టి సారించారు. పట్టణంలో బల్దియా రికార్డుల ప్రకారం 47 వేల నివాసాల్లో రెండు లక్షల జనాభా ఉన్నారు. అందులో భాగంగానే మొదటగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు ప్రజల నుంచి స్పందన లభించింది. దీంతో పట్టణంలోనే రైతుబజార్ ఏర్పాటు చేసి దానికి అనుబంధంగా మరో మూడు చోట్ల రైతుబజార్లు ఏర్పాటు చేశారు.

107 స్టాళ్లు.. 30 షాపులు

ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అన్ని వసతులు సమకూర్చనున్నారు. ప్రజలు, రైతులు దుకాణదారుల వాహనాల కోసం పార్కింగ్. 52 కూరగాయల స్టాళ్లు, 20 చికెన్, మటన్, ఫిష్ విక్రయ స్టాళ్లు, 20 పండ్ల స్టాళ్లు, 10 పువ్వుల విక్రయ స్టాళ్లు నిర్మించనున్నారు. ఫస్ట్ ఫ్లోర్ లో 30 దుకాణాలతోపాటు రెండు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తారు.


ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించేది ఇక్కడే..

తొలి మార్కెట్ ఇదే...

రాష్ట్రంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డును సిద్దిపేట పట్టణంలోని కరీంనగర్ రోడ్డులోని పాత మార్కెట్‌లోనే ఐదేళ్ల క్రితం నిర్మించారు. ఇది ప్రజలకు అందుబాటులో ఉంది. ఇందులో వెజ్, నాన్‌వెజ్, ఫ్రూట్, ఫ్లవర్స్ విక్రయాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ మార్కెట్‌కు ఫుడ్ సేఫ్టీ సెక్యూరిటీ అథారిటీ గుర్తింపుతోపాటు ఐఎస్‌ఓ సర్టిఫికెట్ కూడా లభించింది.

ప్రజల అవసరాలను గుర్తించి..



సిద్దిపేట ప్రజల అవసరాలను గుర్తించి అదనంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నాం. సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆశీస్సులతో ముందుకుసాగుతున్నాం.

–హరీశ్‌రావు, రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో వేర్వేరు చోట్ల బుధవారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు.

మద్యం మత్తులో...

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. భానూర్‌– బీడీఎల్ స్టేషన్ పరిధిలోని హెడ్‌కానిస్టేబుల్ అక్తర్ పాషా తెలిపిన వివరాల ప్రకారం..ఎల్‌బీనగర్‌కు చెందిన సాయికుమార్(37) తన భార్య అరుణతో కలసి 2012లో రామచంద్రాపురం పరిధిలోని ఈదుర్ నాగులపల్లికి బతుకుదెరువుకు వచ్చాడు. భార్య స్వస్థలం ఇక్కడే కావడంతో ఆమె తల్లిగారింటికి సమీపంలో ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. మంగళవారం రాత్రి తాగిచ్చి అత్తగారింటికి వెళ్లాడు. భార్యను ఇంటికి రమ్మని అడగ్గా ఆరోగ్యం బాగాలేదని రానని చెప్పింది. దీంతో సాయికుమార్ నేరుగా తన ఇంటికి వెళ్లాడు. భార్య చీరతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. దీంతో స్థానికుల సహకారంతో ఇంటి లోపలికి వెళ్లిచూడగా, సాయికుమార్ ఉరివేసుకొని కనిపించాడు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత...

అక్కన్నపేట(హుస్నాబాద్): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. అక్కన్నపేటకు చెందిన రమేష్‌కు పదేళ్ల క్రితం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన టేకుల మనీషా(26)తో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుధవారం మనీషా ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అయితే కారణాలు తెలియడం లేదు. ఈ విషయమై ఎస్‌ఐ తాండ్ర వివేక్‌ను సంప్రదించగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని, రాగానే పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

భర్త ఇంటి ముందు భార్య ఆందోళన

పటాన్‌చెరు టౌన్: భర్త ఇంటి ఎదుట ఓ భార్య ఆందోళన చేసిన సంఘటన పటాన్‌చెరులో చోటుచేసుకుంది. బాధితురాలు సౌందర్య తెలిపిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్‌కు చెందిన లింగం సంతోష్ బతుకుదెరువు కోసం పట్టణంలోని అంబేడ్కర్‌కాలనీకి వచ్చాడు. ముత్తంగి గ్రామానికి చెందిన సౌందర్యను 2019లో ఆర్యసమాజంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ పెళ్లికి కేవలం సౌందర్య కుటుంబసభ్యులే హాజరయ్యారు. అప్పుడే మీ కుటుంబసభ్యులు ఎక్కడా అని సంతోష్‌ని అడగ్గా అమ్మ ఉందని, ఆమెకు నచ్చజెప్పుకుంటానని నమ్మించాడు. పెళ్లి తర్వాత ఇస్నాపూర్‌లో కాపురం పెట్టారు. వీరికి ఒక పాప కూడా ఉంది. అయితే సంతోష్ సౌందర్యను పెళ్లి చేసుకున్న విషయం తన కుటుంబసభ్యులకు చెప్పలేదు. మరో పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడన్న సమాచారం తెలుసుకున్న సౌందర్య పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయాలంటూ బుధవారం భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది.


భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న భార్య సౌందర్య

ఓయూలో రేపు పీహెచ్‌డీ అభ్యర్థుల సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆర్ట్స్ కాలేజీ వేదికగా శుక్రవారం ఉదయం 10 గంటలకు పీహెచ్‌డీ అభ్యర్థుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు బుధవారం ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు చెప్పారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు ఓయూ అధికారులు అర్హత మార్కుల విషయంలో అవలంబిస్తున్న విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజ్వరేషన్లు, బీసీ, ఓసీ విద్యార్థులకు కాకతీయవర్సిటీ మాదిరి అర్హత మార్కుల కుదింపు తదితర అంశాలపై జరగే సమావేశానికి అభ్యర్థులు ర్యాంకు కార్డులతో హాజరుకావాలని సూచించారు.

నేడు జాతీయ సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఖురాన్' వివరణపై జాతీయ స్థాయి సదస్సు గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అరబిక్ విభాగం హెడ్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్‌జైసీ తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అరబిక్ విభాగం ఆధ్వర్యంలో కేరళలోని ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ తఫ్సీర్ అల్ ఖురాన్ (ఐఆర్ఐటీఏక్యూ) సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తారన్నారు.

లింగంపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

శేరిలింగంపల్లి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. రాజ్‌కుమార్ యాదవ్ స్మారక క్రికెట్ టీ –20 టోర్నమెంట్‌ను లింగంపల్లిలోని లేగల స్పోర్ట్స్ గ్రౌండ్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అరవింద్ ఆర్.కేవై ఫౌండేషన్ నిర్వాహకులను, క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, మాజీ సర్పంచ్ లేగల వెంకట్‌రెడ్డి పటేల్, నాయకులు రాఘవేందర్‌రావు, కర్చర్ల ఎల్లేష్, అనిల్‌కుమార్ యాదవ్, రాధాకృష్ణ యాదవ్, రమేష్, సోమయ్య యాదవ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ తదితరులు

ఈ రోడ్డుపై జర జాగ్రత్త

- భద్రత చర్యలు మరిచిన కాంట్రాక్టర్
- రోడ్డు వెడల్పు కోసం తీసిన గోతుల్లో పడి ఓ ఉద్యోగి మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): అది మూడు జిల్లాలను కలిపే జాతీయరహదారి కావడంతో విస్తరణ పనులు ఇటీవల మొదలయ్యాయి. అయితే ఈ సిద్దిపేట–హన్మకొండ రోడ్డుపై ఎటువంటి భద్రత చర్యలు చేపట్టలేదు. ఫలితంగా ఓ నిండు ప్రాణం బలైంది. రోడ్డుకు ఒకవైపు కంకర, యాష్ నింపేందుకు తవ్వారు. తవ్విన చోట, పనులు ప్రారంభమైన మొదట, చివరగానీ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రాత్రివేళ ఈ రోడ్డు ప్రయాణం చేసేవారికి ఎక్కడ రోడ్డు తవ్వారో కూడా తెలియని పరిస్థితి. కనీసం ఎక్కడా బారికేడ్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఇదే రోడ్డుపై నాగసముద్రాల సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సుధాకర్ సోమవారం రాత్రి ప్రయాణం చేస్తూ రోడ్డు విస్తరణకు తవ్వినచోట పడి మృతి చెందాడు. సుధాకర్ సహోద్యోగి ఫిర్యాదు చేసినా, రోడ్డు విస్తరణ పనులు చేపట్టే కంపెనీ ఎటువంటి భద్రతచర్యలు చేపట్టలేదు.




సూచికబోర్డు కూడా లేని బస్వాపూర్ రోడ్డు

భార్యను చంపింది భర్తే

సిద్దిపేటకమాన్: వివాహిత హత్యకేసును పోలీసులు ఛేదించారు. హత్య చేసింది భర్తనే అని తేల్చారు. సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో వన్‌టౌన్ సీఐ భిక్షపతితో కలిసి ఏసీపీ దేవారెడ్డి బుధవారం ఆ వివరాలు వెల్లడించారు. మిరుదొడ్డి మండలం కొండాపూర్‌కు చెందిన వివాహిత సుజాత సిద్దిపేట పట్టణంలోని బాలాజీ గార్డెన్ సమీపంలో ఈ నెల 18వ తేదీన రాత్రి హత్యకు గురైంది. మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా సుజాత భర్త లింగంను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా, తానే హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. తాగుడుకు బానిసైన లింగం డబ్బుకు ఇబ్బంది పడుతుండేవాడు. ఈ క్రమంలోనే భార్యతో గొడవ జరిగింది. సంఘటనస్థలంలోనే చంద్రశేఖర్ ఉన్నాడు. ఆయన ఎదుటే భార్య జుట్టుపట్టి నేలకు కొట్టి గొంతు నులిమి చంపాడు. హత్య చేసిన లింగం, అక్కడే ఉన్న చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా కేసును ఛేదించిన సీఐ భిక్షపతి, ఎస్‌ఐ నరసింహారావు, క్రైమ్ పార్టీ సిబ్బంది భూమలింగం, కనకరాజు, రాజులను ఏసీపీ దేవారెడ్డి అభినందించారు.


సీఐ భిక్షపతితో కలిసి మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి


చెట్టుకు గుద్దుకున్న శివరాజ్

ప్రాణం తీసిన అతివేగం

టేక్మాల్(మెదక్): అతివేగం..అజాగ్రత్త ఓ నిండు ప్రాణం బలి తీసుకుంది. టేక్మాల్ ఏయస్‌ఐ తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం...సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌కు చెందిన మంగళి శివరాజ్(42), అదే గ్రామానికి చెందిన వాహబ్‌తో కలిసి మంగళవారం ఉదయం బైక్‌పై ఏడుపాయలకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో రాత్రివేళ టేక్మాల్ మండలంలోని కాద్లూర్ శివారుకు వచ్చాక బైక్‌ను వేగంగా నడపడంతో రోడ్డుపక్కన ఉన్న హరితహారం గుంతలో పడి చెట్టును ఢీకొట్టి ముళ్లపొదలో పడ్డారు. దీంతో బైక్ నడుపుతున్న శివరాజ్‌ను తీవ్రగాయాలు అయ్యాయి. వెనుక కూర్చున్న వాహబ్‌కు స్వల్పగాయాలయ్యాయి. 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో శివరాజ్ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు శరణప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య మరణాన్ని తట్టుకోలేక...

- పురుగుల మందు తాగిన భర్త.. చికిత్స పొందుతూ మృతి
- అనాథలైన ఇద్దరు పిల్లలు

సిద్దిపేటరూరల్: నాలుగునెలల క్రితం భార్య ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణం ఆయన్ను మనోవేదనకు గురిచేసింది. భార్య లేని తాను ఈ లోకంలో ఉండలేనని ఆ భర్త పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లిదండ్రుల మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. ఎస్‌ఐ విఠల్ చెప్పిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన చాకలి వరుణ్ (26) ఆటో నడుపుతుండగా, భార్య లావణ్య ఇళ్లలో పనిచేసేది. వీరికి నిఖిలేష్(4), మోక్షిత(2) సంతానం. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వరుణ్ భార్య లావణ్య నాలుగు నెలల క్రితం ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి చిన్నారుల ఆలనాపాలనా తండ్రి చూసుకునేవాడు. భార్య మరణం వరుణ్‌కు కుంగదీసింది. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లోనే గడ్డి మందు తాగాడు. గమనించిన వరుణ్ చిన్నాన్న అంజయ్య వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రభుత్వం స్పందించి అనాథలైన ఇద్దరు చిన్నారులను అదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చాకలి వరుణ్ (ఫైల్)


పిల్లలు నిఖిలేష్, మోక్షిత

కనీస సౌకర్యాల కల్పనలో విఫలం

మియాపూర్: చందానగర్ డివిజన్‌లోని అహ్మద్‌నగర్‌లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం అహ్మద్‌నగర్‌లో ఆయన పర్యటించారు. అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవిష్యత్‌లో అధికార పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. ఎమ్మెల్యే గాంధీ రాత్రి పర్యటనల పేరుమీద జిమ్మిక్కులు చేస్తున్నారని అభివృద్ధిని గాలికొదిలేశారని ఆయన విమర్శించారు. అహ్మద్‌నగర్‌లో కనీస సౌకర్యాలు డ్రైనేజీ, నీరు, రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యరమేష్, పాషా, రంజాన్, మోయస్, అహ్మద్‌నగర్ వాసులు పాల్గొన్నారు.



మొక్కజొన్నకే మొగ్గు

- యాసంగిలో రికార్డుస్థాయిలో సాగు
- పత్తి, ఆలుగడ్డ తీశాక రెండో పంటగా ప్రాధాన్యం


జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాలో ఈ యాసంగిలో మొక్కజొన్న సాగు పెరిగింది. దాదాపు 25 వేల ఎకరాల్లో పంట సాగైనట్టు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా భూగర్భజలాలు పెరిగాయి. దీంతో రైతులు మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపారు. ఫలితంగా సాగువిస్తీర్ణం భారీగా పెరిగింది. గతయాసంగిలో జిల్లావ్యాప్తంగా 5వేల ఎకరాల్లో కూడా మొక్కజొన్న సాగు కాలేదు. కానీ తాజా నాలుగైదు రెట్లు సాగు విస్తీర్ణం పెరిగింది. వ్యవసాయ బావులు, బోర్లలో సమృద్ధిగా నీరు ఉండడం, మొక్కజొన్నకు మార్కెట్ మంచి ధర పలుకుతుండడం కూడా సాగు విస్తీర్ణం పెరిగేందుకు కారణమైందని చెప్పవచ్చు.

పత్తి, ఆలుగడ్డ తీశాక సాగు

వానాకాలం మొదట్లో వేసిన పత్తి, అక్టోబర్, నవంబర్ మాసాల్లో విత్తిన ఆలుగడ్డ పంటలు చేతికి వచ్చాక, మొక్కజొన్నసాగుకు రైతులు సిద్ధమయ్యారు. పత్తి తీశాక రెండో పంటగానూ, సోయాబీన్ వేసుకున్న వారు ఆలుగడ్డ రెండో పంటగా, అది తీశాక మూడో పంటగా మొక్కజొన్న సాగు చేశారు. అయితే పలుచోట్ల పత్తితీత పూర్తికాకపోయినా, చివరిదశలో ఉన్నా, పత్తికోసం ఎదురు చూడకుండా అది పీకేసి మొక్కజొన్న వేశారు. దీంతోనే సాగు విస్తీర్ణం పెరిగింది. వర్షాకాలంలో పంటలు పూర్తిగా దెబ్బతిన్న చోట శనగసాగుకు బదులు రెండోపంటగా మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపారు. శనగకు మార్కెట్‌లో సరైన ధర లేకపోవడం, పంట దిగుబడి అంతంతమాత్రంగానే వస్తుండడం నిరాసక్తత కారణం.


జహీరాబాద్‌లో సాగయిన మొక్కజొన్న


పది ఎకరాల్లో మొక్కజొన్న వేశా



ఈయాసంగిలో 10 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. ఇతర పంటలు సాగు చేయడం వల్ల అంతంత మాత్రంగానే లాభాలు వస్తున్నాయి. పెట్టుబడులు కూడా ఎక్కువ అవుతున్నాయి. గతంలో ఉల్లిగడ్డ అధికంగా సాగుచేశా. ఖర్చు పెరగడం, నిల్వ సదుపాయం లేకపోవడంతో మొక్కజొన్న వేశా.

–ఎస్.అంజిరెడ్డి, పైడిగుమ్మల్ రైతు


నీళ్లున్నాయని...



ఈ ఏడాది బోర్లలో నీరు పుష్కలంగా ఉంది. దీంతో రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేసిన. ఇతర పంటల వల్ల ఉపయోగం కనిపించలేదు. వర్షాకాలంలో సాగు చేసిన పంటలకు ఆశించిన మేర దిగుబడి రాలేదు.

–మహమ్మదలీ, కోహీర్ రైతు

విస్తారంగా సాగైంది



రైతులు మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారు. నీటివసతి చూసుకొని ఇతర పంటల వైపు నకు వెళ్లకుండా మొక్కజొన్న సాగుకు మొగ్గుచూపారు.

–భిక్షపతి, జహీరాబాద్ ఏడీఏ